## మన ఆచారములు - అంతరార్థములు

## మానసపూజ

**- నిత్యానంద్.**

తులసీదళపూజ విన్నాం, పత్రిపూజ విన్నాం, పుష్పపూజ విన్నాం - కాని, ఈ మానసపూజ ఏమిటండీ! అంటారా? చాలా మందికి తెలిసే ఉంటుంది. కాని, తెలియనివారికోసం ఒక్కసారి మాట్లాడుకుందాం. బాహ్యపూజ అంటే ధూప, దీప, నైవేద్య సహితముగా చేసే పూజ. మానసపూజ అంటే మనసులోనే భగవధ్యానము చెయ్యడం. ఇది ఎంతో నిశ్చలమైన మానసిక స్థితిలోనే సాధ్యమవుతుంది.

బాహ్య పూజ చేసినప్పుడు భగవంతుని ఎలాగైతే ఆవాహనము (స్వాగతము పలకడము) చేస్తామో, ఎలా ఆసనము చూపించి ఆహ్వానిస్తామో, ఎలా కాళ్ళు కడుగుకునేందుకు (పాద్యమునకు) నీళ్ళు ఇస్తామో, ఇంకా అర్ఘ్యము, ఆచమనీయము, స్నానము, వస్త్రము ఇత్యాది ఉపచారములతో (షోడశోపచారములతో) ఎలా వారిని మర్యాద చేస్తామో అదే విధముగా మానసపూజలో కూడా అంతరంగములో ఇవన్నీ చేస్తాము. అయితే మన హృదయపీఠాన్నే ఆయనకు ఆసనముగా చూపిస్తాము. ఒక వ్యక్తియొక్క మూలాధారములోని కుండలినీ శక్తి సహస్రారమును చేరినపుడు ఉత్పన్నమయ్యే అమృతధారలనే ఆయనకు పాద్యమునకు, అర్ఘ్యమునకు, ఆచమనమునకు మరియు స్నానమునకు సమర్పిస్తాము. ఆయనది విశ్వాకారం, ఆయనకి ఇచ్చే వస్త్రం విశాలమైన ఆకాశమే! ప్రతి జీవిలో కూడా ఆకాశతత్వమున్నది. దానినే ఆయనకు వస్త్రముగా సమర్పించుకుంటామన్నమాట. ఈ ప్రపంచములో మనకు ఆయన వలన లభిస్తున్న ఓషదులను, సుగంధములను ఆయనకే అర్పిస్తున్నాము. మరొక రకముగా మనలోని మూలాధారమునుండి సహస్రారమువరకు అన్ని పుష్పములు వెదజల్లే సుగంధాన్ని ఆయనకు ధూపముగా అర్పిస్తామన్నమాట. చిత్త ప్రవృత్తిని (మన సంస్కారముల చిట్టాని) ఆయనకి పుష్పముగా సమర్పించుకుంటామన్నమాట. మన ప్రాణములను (లేదా ఊపిరిని) ఆయనకు ధూపముగా సమర్పించుకుంటాము. మనలోని తేజస్‌ని (జీవిలో మాత్రమే ఉండే శక్తిని) ఆయనకు దీపముగా, ఆత్మజ్ఞానప్రాప్తి పొందడమువలన కలిగిన సారమును ఆయనకు నైవేద్యముగా, అనాహత ధ్వని (మనసు శాంతితో నిండినపుడు హృదయకుహరములో ధ్వనించే శబ్దం) గంటగా, వీచేగాలిని ఆయనకు పంకాగా (చామరముగా), విచ్చుకున్న సహస్రారము (వేయిరేకుల కలువగా వర్ణిస్తారు) ఆయనకు గొడుగుగా (ఛత్రముగా), ఉచ్ఛరించే శబ్దములు ఆయనకు సంగీతముగా, ఇంద్రియ కర్మలు ఆయనకు సమర్పించే నృత్యముగా, మూలాధారము మొదలు, సహస్రారము వరకు వికసించిన పుష్పములుగా తలంచి - ఆ పూలమాలను ఆయనకు అలంకరిస్తూ, ఆయనకు మన ఆతిథ్యాన్నిస్తున్నామన్నమాట! ఇది విన్నప్పుడు చాలా సందర్భములలో అతిశయముగా అనిపించవచ్చు. కాని, అనుభవముతో మన పూర్వికులు చెప్పిన విషయమిది.

మనము చరిత్రలో తాన్‌సేన్ గురించి, ఆయన ఆలపించిన దీపక రాగము గురించి విని ఉన్నాము. హృదయమును లయముచేసి రాగమును ఆలపిస్తే రాళ్ళను కూడా కరిగించవచ్చని, అలాగే మనలోని ప్రతి అణువును ఆ పరమాత్మునిపై నిలిపి చేసే ప్రార్థనను ఆ భగవంతుడు స్వీకరిస్తాడని, త్రికరణశుద్ధిగా నమ్మితే అది జరిగితీరుతుంది. ***"పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి తదహం భక్త్యుపహృతం అశ్నామి ప్రయతాత్మన:"*** అన్నది గీతావాక్యం. (**గురుదేవుల ఆశీస్సులతో...**)

*